సాక్షి
మెదక్
గురువారం । 13 । జులై । 2023



అయ్యో బిడ్డా..
ప్రేమ జంట ఆత్మహత్య ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. తల్లిదండ్రులు తమ పిల్లలపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. 8లో



ప్లాస్టిక్ వ్యర్థాల గుట్ట
మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన గల ఓ వైన్స్ వెనకాల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోయాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. 9లో

దరఖాస్తుల ఆహ్వానం
మెదక్ కలెక్టరేట్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆసక్తి, అర్హత గల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత యాజమాన్యాల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడు హుండీ లెక్కింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ దేవి ఆలయ హుండీ ఆదాయాన్ని నేడు లెక్కించనున్నట్టు ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరుగుతుందని చెప్పారు.

'కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి'

నర్సాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అధికారులు బీడీ, భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చట్ట ప్రకారం వారికి వేతనాలు అందకపోయినా కార్మిక శాఖ అధికారులు స్పందించకపోడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు నందం, లక్ష్మణ్, పార్వతి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన్



రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నార్సింగి మండలానికి చెందిన గోవర్ధన్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. దళితుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

మెదక్ కలెక్టరేట్: పలు ట్రేడ్‌లలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మెదక్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023- 2024 సంవత్సరానికి సంబంధించి కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), మెకానిక్ డీజిల్, 2023- 2025 రెండేళ్ల వ్యవధి గల డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ప్రవేశానికి అవకాశం ఉన్నట్టు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెలాఖరు వరకు అవకాశం ఉందని.. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు.

దుర్గమ్మ సేవలో సునీతారెడ్డి



తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బుధవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆమెకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సత్కరించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం మెదక్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద వారు మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని.. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి అజయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినాకర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుచేసి.. పప్పుకూడు

మధ్యాహ్న భోజన బిల్లులకు గ్రహణం
- ఐదు నెలలుగా పెండింగ్
- జిల్లావ్యాప్తంగా రూ. 2.38 కోట్ల బకాయిలు
- వంట మాతో కాదంటున్న నిర్వాహకులు



కూచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం (ఫైల్)

మెదక్‌జోన్: పేద విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం పెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం తీసుకొచ్చింది. కానీ సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో పథకం నీరుగారి పోతుంది. ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండగా.. అప్పు చేసి నిర్వాహకులు విద్యార్థులకు వంటచేసి పెడుతున్నారు. ఇక ఈ ఉద్దెర పని చేయలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో 891 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 90వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు.
- వాటిలో 239 పాఠశాలల్లో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు.
- మిగితా 652 పాఠశాలల్లో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా విద్యార్థులకు మిడ్ డే మీల్స్ కొనసాగిస్తున్నారు.
- కాగా గతేడాది విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ నుంచి మార్చి వరకు కొన్ని రకాల బిల్లులు రాలేదు.
- ఇందులో 1 నుంచి 8వ తరగతి వరకు గుడ్డు బిల్లులు జిల్లావ్యాప్తంగా రూ. 65 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించి వంట బిల్లులు రూ. 80 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఈ ఏడాది జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కాగా నేటికీ నెలరోజులు గడుస్తున్నా బిల్లులు రాలేదు.
- జూన్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు అన్నిరకాల బిల్లులు రూ. 78 లక్షలు కాగా వంట నిర్వాహకులకు రూ. 15 లక్షలు వేతనాలు మొత్తం కలిపి ఒక్క జూన్‌లోనే రూ. 93 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- గతేడాది నాలుగు నెలలకు సంబంధించి రూ.1.45 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత నెల జూన్‌లో రూ. 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల వంట బిల్లులు రూ. 78 లక్షలు అందలేదు.
- అలాగే వంట నిర్వాహకులకు సంబంధించిన గౌరవ వేతనం రూ. 15 లక్షలు మొత్తం కలిపి రూ. 93 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- గతేడాది అకడమిక్ ఇయర్‌లో రూ. 78 లక్షలతో పాటు గత జూన్‌లో రూ. 93 లక్షలు కలిపి మొత్తం రూ. 2.38 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పాటించని మెనూ..
- నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల కాకపోవటంతో నిర్వాహకులు నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.
- అనేక పాఠశాలల్లో విద్యార్థులకు చారుతోనే మధ్యాహ్న భోజనం నెట్టుకొస్తున్నట్టు సమాచారం. సంబంధిత అధికారులకు తెలిసినా చూడిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- ఇదేమిటని నిర్వాహకులకు ప్రశ్నిస్తే మాకు నెల నెల రావాల్సిన బిల్లులు సక్రమంగా వస్తే మెనూ ప్రకారం భోజనం పెడతామని చెబుతున్నారు.
- దీంతో ఉపాధ్యాయులు సైతం నిర్వాహకులను ఏమి అనలేని పరిస్థితి నెలకొంది.

రూ. 20 వేలు అప్పుచేశాం



మధ్యాహ్న భోజనం కోసం కిరాణం షాపులో రూ. 20 వేలు అప్పుచేశాం. ఐదు నెలలుగా బిల్లులు రాకుంటే భోజనం ఎలా పెట్టాలి. కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మాకు నెలకు రూ. 3 వేల వేతనం ఇస్తామన్నారు. అది కూడా అమలు చేయడం లేదు.

– లక్ష్మి, వంట నిర్వాహకురాలు, కూచన్‌పల్లి



రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

సమన్వయంతో ఎంపిక చేయండి

దళితబంధు, గృహలక్ష్మి పథకాలపై కలెక్టర్ రాజర్షిషా సమీక్ష

మెదక్ కలెక్టరేట్: నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని దళితబంధు, గృహలక్ష్మి పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధుకు సంబంధించి మెదక్ నియోజకవర్గానికి 1,100, నర్సాపూర్‌కు 1,100 చొప్పున లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు జయరాజ్, విజయలక్ష్మి, కృష్ణమూర్తి, జమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక పుస్తకం ఆవిష్కరణ
ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకుల ద్వారా రూ. 30,796.28 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ రాజర్షిషా బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. అనంతరం 2023–24 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మహిళలతో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా బుధవారం నార్సింగి మండలంలోని జప్తిశివునూర్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులమయం చేశారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తాము అధికారంలోకి రాగానే రూ. ఐదు వందలకే వంట గ్యాస్ అందజేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమిలేదని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రమణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు గౌస్, కేశవులు, యాదగిరి, సిద్దిరాంలు, ఉదయ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలి



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు అందుకునేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్– 2023లో భాగంగా హైదరాబాద్ కమిషనర్ ఆఫీస్ నుంచి ఎస్‌బీఎం డైరెక్టర్ సురేష్‌బాబు వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు పీడీ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై భగ్గు



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ఉచిత కరెంట్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందజేస్తూ రైతులకు అండగా ఉంటున్నారని కొనియాడారు. దీనిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పురం మహేష్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, అర్జున్, నాగభూషణం, మండల రైతు కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో భారీ వర్షం

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం



మెదక్‌జోన్: మెదక్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో అత్యధికంగా 61.5 మీ.మీ వర్షపాతం నమోదు కాగా మెదక్ మండలం రాజ్‌పల్లిలో 60.5 మీ.మీ వర్షపాతం కురిసింది. పెద్దశంకరంపేటలో 50, కొల్చారంలో 44.5, పాపన్నపేట మండలం మీన్‌పూర్‌లో 42.8, వెల్దుర్తి మండలం దామరంచ, కొడిపల్లి, చిన్నశంకరంపేట మండలాల్లో 30కి పైగా మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురవగా.. ఇప్పటికే విత్తనాలు వేసి ఆకాశం వైపు చూస్తున్న రైతులకు ఎంతో మేలు చేసింది. ఈ వర్షంతో వరినాట్లు ఊపందుకోనుండగా.. ఇప్పటికే ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు విత్తనాలు మొలకెత్తడం లేదనే దిగాలు తగ్గింది.

అక్రమ బదిలీలను ఆపండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్


మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయుల అక్రమ బదిలీలతో పేద విద్యార్థులు చదువు దూరమయ్యే ప్రమాదం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రుల పైరవీలు జోరుగా సాగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు వారికి అనుకూలంగా ఉన్న మండలాలకు వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అక్రమ బదిలీలను తక్షణమే నిలిపివేయాలని.. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

బల్దియా ఆదాయానికి గండి!

ఒక్క జూన్‌లోనే 19 రోజుల కలెక్షన్ నిల్



మెదక్‌లోని కూరగాయల మార్కెట్



81201 తేది:
పురపాలక సంఘం, మెదక్
2022-23 తైబజార్ ఫీజు
బండి/గంప/కూరగాయల సంది
రూ॥ 20-00 సంతకం

తైబజార్‌కు సంబంధించిన రసీదు

మెదక్ మున్సిపాలిటీ: బల్దియాకు తైబజార్ నుంచి వచ్చే ఆదాయానికి గండి పడింది. ప్రతిరోజు సగటున రూ. 10 వేల వరకు వసూలు చేసినా ఏడాదికి లక్షలాది రూపాయలు మున్సిపల్ ఖజానాకు చేకూరుతుంది. మెదక్ పట్టణంలో వందలాది మంది వీధి వ్యాపారులు ఉండగా.. నిత్యం వివిధ రకాల వాహనాలు సరుకులు తీసుకొస్తుంటాయి. వాహనాన్ని బట్టి రూ. 50 నుంచి రూ. 100 వరకు తైబజార్ వసూలు చేసినా వాటి నుంచి వేలాది రూపాయల ఆదాయం సమకూరుతుంది. గతంలో మున్సిపల్ పరిధిలో తైబజార్‌ను వేలం ద్వారా కాంట్రాక్ట్ దక్కించుకునే వారు. ఈ రూపంలో ఏడాదికి బల్దియా ఖజానాకు దాదాపు రూ.15 లక్షల ఆదాయం వచ్చేది. అయితే కూరగాయల అమ్మకానికి వచ్చే రైతులను తైబజార్ కోసం వేధిస్తున్నారనే ఉద్దేశంతో ప్రైవేట్ కాంట్రాక్టర్‌ను రద్దు చేశారు. మున్సిపల్‌లోని ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా తైబజార్ వసూలు చేయిస్తున్నారు. దీంతో మున్సిపల్‌కు మొక్కుబడి కలెక్షన్ మాత్రమే వస్తుంది.

రికార్డుల్లో సున్నా..
మెదక్‌లోని కూరగాయల మార్కెట్‌కు ఆదివారం, పండగ, సెలవు దినాలు అంటూ ఏమి ఉండవు. కానీ బల్దియాలో అధికారులు తైబజార్ కలెక్షన్ రికార్డుల్లో మాత్రం నిల్ (ఏమిలేదు) అంటూ రాస్తున్నారు. సగటున ప్రతిరోజు తైబజార్ ద్వారా రూ. 10 నుంచి 15 వేల వరకు కలెక్షన్ అవుతుందని గతంలోని కాంట్రాక్ట్ పొందిన వారు చెబుతున్నారు. కాగా మున్సిపల్ ఉద్యోగులు మాత్రం రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు మాత్రమే వస్తున్నట్టు చూపుతున్నారు.

ఆదాయం ఎటుపోతోంది?
ఒక్క జూన్‌లోనే 19 రోజులు అధికారులు నిల్ కలెక్షన్ చూపారు. జూన్‌లో మొత్తం వసూలైన తైబజార్ ఆదాయం రూ. 37,800 వచ్చినట్టు అధికారులు చెబుతుండగా.. ప్రైవేట్ కాంట్రాక్టర్ తైబజార్ చేసినప్పుడు సగటున రోజుకు రూ. 10 నుంచి రూ. 15 వేలు వసూలు అయ్యేవని తెలుస్తోంది. బల్దియాకు రావాల్సిన రూ. లక్షల ఆదాయం పక్కదారి పడుతోందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అలాగే తైబజార్ వసూలు చేసే పుస్తకాలపై ముద్ర.. అధికారి సంతకం లేకుండానే చిట్టీలను ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇస్తూ వసూలు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రెండేళ్లుగా బల్దియా ఆదాయానికి భారీ గండి పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దశాబ్ది ఉత్సవాల కారణంగా



జూన్ 2 నుంచి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణంలో తైబజార్ వసూలు చేసే సిబ్బందిని ఇతర పనులకు వినియోగించాం. అందుకే తైబజార్ కలెక్షన్ చేయలేకపోయాం. ఇకపై దృష్టి సారిస్తాం.

– జానకీరాంసాగర్, మున్సిపల్ కమిషనర్, మెదక్

విచారణ జరిపిస్తాం



తైబజార్ కలెక్షన్ తగ్గిన విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. వివరాలు తెలుసుకొని విచారణ జరిపిస్తాం. మున్సిపల్ ఆదాయం వచ్చే తైబజార్ పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

– చంద్రపాల్, మున్సిపల్ చైర్మన్

క్లుప్తంగా

గేదెను ఢీకొన్న గూడ్స్ రైలు



గూడ్స్ రైలు కింద గేదె కళేబరం

తూప్రాన్: గేదెను గూడ్స్ రైలు ఢీకొన్న ఘటనలో గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న గూడ్స్ రైలు తూప్రాన్ మండలం నాగులపల్లి రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న గేదెను ఢీకొట్టింది. ఈ ఘటనలో గేదె రైలు చక్రాల కింద ఇరుక్కొని మృతి చెందింది. దీన్ని గమనించిన రైలు డ్రైవర్ రైలును నిలిపివేసి స్థానికుల సహాయంతో గంటపాటు శ్రమించి గేదెను పక్కకు లాగారు. అనంతరం గూడ్స్ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లింది.

మాజీ ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ మాజీ ఎంపీటీసీ గొర్ల వీరన్నపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) కేసు నమోదయినట్లు ఎస్‌ఐ మహేశ్ బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ అకునూరి దీనక్యాతరిన్ కుటుంబానికి సంబంధించిన భూమిని అక్రమంగా పట్టా చేసుకోవడం, అప్పు తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరినందుకు కులం పేరుతో దూషించాడని, కొట్టాడని ఆరోపిస్తూ మే18న మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పోలీసులు విచారణనంతరం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ మరమ్మత్తులు చేపట్టిన వారి పనులను అడ్డగించడమే కాకుండా వారిపై దాడి చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో గజ్వేల్ విద్యుత్ ఏడీఈ దాసరి నర్సయ్య ఆధ్వర్యంలో విద్యుత్ మరమ్మత్తు పనులను చేట్టారు. అందులో భాగంగా 133 కేవీ లైన్ కింద ఉన్న చెట్లు, పొదలను సిబ్బందిచేత నరికి వేయిస్తున్నారు. ఈ క్రమంలో రంగాయపల్లి గ్రామానికి చెందిన కర్రె చిన్న స్వామి, శ్రీశైలం, కనకయ్యలు విద్యుత్ సిబ్బంది వద్దకు వచ్చి తమకు చెందిన మామిడి చెట్టును ఎందుకు కొట్టి వేయించారని దూషించడమే కాకుండా, సిబ్బందిపై, ఏడీఈపై దాడి చేశారు. దీంతొ ఏడీఈ నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి



మృతుదు పవన్‌కుమార్

జిన్నారం(పటాన్ చెరు): పరిశ్రమలో విధులు నిర్వహించి బయటకు వస్తున్న సమయంలో ఛాతి నొప్పితో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన జిన్నారం మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుంళం జిల్లా పాతపట్నం మండలం కాగువడా గ్రామానికి చెందిన బల్ల పవన్ కుమార్(25) గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని హెటిరో పరిశ్రమలో కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో అతనికి ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేక్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్‌ఐ ఐలయ్యకు మెమో జారీ

మద్దూరు(హుస్నాబాద్): రిజిస్ట్రేషన్ పనుల్లో తప్పుడు సమాచారంతో ఇబ్బందులకు గురిచేసిన ఆర్‌ఐ ఐలయ్యపై మెమో జారీ చేసినట్లు తహసీల్దార్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ భూమిని అక్రమంగా వేరొకరికి పట్టా మార్పిడికి పాల్పడినందునా రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాలపల్లికి చెందిన వెతుకు గోపాల్‌రెడ్డి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆర్‌ఐపై మెమో జారీ చేశామని తహసీల్దార్ పేర్కొన్నారు.

అయ్యో బిడ్డా.. ఎంత పనిచేశావు

- ప్రేమజంట ఆత్మహత్యతో తీవ్ర విషాదం
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు
- కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు



లచ్చపేటలో భగీరథ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు



భగీరథ్ అంత్యక్రియల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దేవుడా మేమెట్లా బ్రతకాలి..అయ్యో బిడ్డా..ఎంత పనిచేశావు..అంటూ గుండెలు బాదుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలపై పడి రోదిస్తున్న ఘటన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించాయి. తన బిడ్డ మృతదేహాన్ని చూసిన నేహా తల్లి ఆసుపత్రి మార్చురి వద్ద స్పృహ తప్పింది. భగీరథ్ తల్లి సైతం విగత జీవిగా మారింది. తన కొడుకును చూసి గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడున్న వారిని కలచివేసింది. ఆసుపత్రితో పాటు వారి ఇండ్లలో కుటుంబీకులు, బంధువుల రోదనలతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

లచ్చపేట, దుబ్బాకలో తీవ్ర విషాదం..

ప్రేమజంట భగీరథ్(17), నేహా(16) బుధవారం తెల్లవారుజామున లచ్చపేటలోని ప్రియుడి ఇంట్లో ఒకే దులానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారనే సంఘటనతో దుబ్బాక, లచ్చపేటలో తీవ్ర విషాదం అలుముకుంది. ఉదయంనుంచి సాయంత్రం వరకూ ఎవరిని కదిలించినా ఈ సంఘటనను తలుచుకుంటూ కంట తడిపెట్టడమే కనిపించింది. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో మైనర్ ప్రేమ జంటకు వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించి వారి బంధువులకు మృత దేహాలను అప్పగించారు. ప్రేమ జంట బలవన్మరణానికి పాల్పడక ముందు రాసి ఉంచిన సూసైడ్ నోట్‌లో మా మృతదేహాలను ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించాలని రాసి ఉంచారు. ఇందుకు వారి వారి కుటుంబాల వారు ఒప్పుకోకపోవడంతో ఎస్‌ఐ మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు భగీరథ్, నేహా మృత దేహాలను వేర్వేరుగా వారి బంధువులతో కలిసి అంత్యక్రియలకు తరలించారు. భగీరథ్ మృతదేహానికి లచ్చపేటలో, నేహా మృతదేహానికి దుబ్బాకలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇరువురి అంత్యక్రియల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు..

మైనర్ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడ సంఘటనను తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావులు వారి కుటుంబాలను పరామర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యే భగీరథ్, నేహా అంత్యక్రియల్లో పాల్గొని ఇరు కుటుంబాలను ఓదార్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డితో పాటు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.



నేహా కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రైతుల ఖాతాల ఫ్రీజ్ తీసేస్తాం

- ప్రభుత్వ సాయం డబ్బులు చెల్లిస్తాం
- సాక్షి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే, ఆర్డీఓ, వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): పంట రుణాలను రెన్యూవల్ చేసుకోనందున బ్యాంకర్లు రైతుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ప్రభుత్వం పంట పెట్టుబడికి రైతులకు అందజేస్తున్న రైతుబంధు, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మీ డబ్బులను ఇవ్వకపోవడంపై మంగళవారం రైతుల ఖాతాలు ఫ్రీజ్ అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు, ఆర్డీఓ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ స్పందించారు. బుధవారం వట్‌పల్లిలోని ఏపీజీవీబీకి చేరుకొని రైతుల ఖాతాలను ఎందుకు హోల్డ్‌లో పెట్టారని బ్యాంకు మేనేజర్ జనార్దన్‌ను ప్రశ్నించగా, తాము రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టలేదని బదులిచ్చారు.

మంగళవారం సాక్షిలో కథనం వచ్చిందనే విషయాన్ని బ్యాంకర్ల దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. అక్కడున్న ఓ మహిళ రైతు బ్యాంకు ఖాతాను మేనేజర్‌తో పరిశీలింపజేయగా హోల్డ్‌లో ఉన్నట్లు రుజువైంది. ఈ విషయంలో సదరు బ్యాంకు మేనేజర్ తెల్లమొహం పెట్టుకోవలిసిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆ తప్పును ఫీల్డ్ ఆఫీసర్‌పై రుద్దే యత్నం చేశాడు. అధికారులు బ్యాంకుకు వచ్చారనే విషయం తెలుసుకున్న బాధిత రైతులు కూడా బ్యాంకుకు చేరుకొని తమ గోడు చెప్పుకున్నారు. ప్రభుత్వ పథకాలను పంట రుణాల వడ్డీ పేరిట ఆపేస్తున్నారని వారి దృష్టికి తెచ్చారు. కలెక్టర్ సర్క్యులర్ కాపీని వ్యవసాయాధికారులు ఏడీఏ శివకుమార్, ఏఓ మహేష్‌చౌహాన్ బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బ్యాంకు అధికారులతో రైతుబంధును ఎలా ఆపుతారని మేనేజర్‌ను నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆపొద్దని, ఇప్పటికే రూ.50వేల వరకు పంటరుణం మాఫీ చేసిందని, త్వరలో రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామన్నారు. వెంటనే రైతులకు పంట పెట్టుబడితో పాటు ఇతర ప్రభుత్వ పథకాల డబ్బులు అందించాలని ఆదేశించారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆర్డీఓ, వ్యవసాయాధికారులు

సాక్షి కథనంపై ఎమ్మెల్యే ప్రశంసా..

రైతుల ఖాతాలు ఫ్రీజ్ కథనం ప్రచురించినందుకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సాక్షిని ప్రశంసించారు. బ్యాంకు అధికారులు రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతుబంధు సహాయాన్ని నిలిపివేసినట్లు అప్పటి వరకు తన దృష్టికి రాలేదన్నారు. ఉదయం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం చూసి విషయం తెలుసుకున్నానన్నారు.

తాళం వేసిన ఇండ్లలో చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇండ్లలో చోరీ జరిగింది. ఈ సంఘటన మండల పరిధి గూడూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కావేటి లక్ష్మీ మంగళవారం ఇంటికి తాళం వేసి రావెల్లి గ్రామంలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి అల్మారాలోని అరతులం బంగారు పుస్తె, 40 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామంలోని పట్నం మహేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండడంతో తాళం పగులకొట్టి రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



బీరువాలో చిందర వందరగా పడేసిన వస్తువులు

సీఎన్‌జీ ఆటో చోరీకి యత్నం

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గంగన్నగారి బాబు ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారిగానే తన సీఎన్‌జీ ఆటోని ఇంటి ముందు పార్క్ చేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదు. ఆటోని గ్రామ శివారులోకి తోసుకుంటూ తీసుకెళ్లారు. డ్రైవర్ సీటును ధ్వంసం చేశారు. కింది భాగంలో ఉన్న బ్యాటరీతో పాటు రెండు టైర్లను ఎత్తుకెళ్లారు. చోరీ విలువ రూ.15వేలు ఉంటుందని బాధితుడు బాబు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



ఆటో నుంచి బ్యాటరీ తీస్తున్న దృశ్యం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య



మద్దుల కిష్టారెడ్డి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌కు చెందిన మద్దుల కిష్టారెడ్డి (52) వ్యవసాయం చేసుకుంటూ భార్య విజయలక్ష్మి, కొడుకు మనీష్‌రెడ్డి, కూతురు మనుశ్రీ లను పోషించుకుంటున్నాడు. కాగా రెండు సంవత్సరాల క్రితం కొడుకు మనీష్ రెడ్డి గ్రామంలో ఈతకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. కొడుకు మరణంతో మనోవేదనకు గురైన కిష్టారెడ్డి ప్రతీ రోజు కొడుకును గుర్తుకు తెచ్చుకునేవాడు. ఈ క్రమంలో కొడుకు మరణాన్ని తట్టుకోలేక కిష్టారెడ్డి మంగళవారం రాత్రి రుద్రారం శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న గదిలో కిష్టారెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటినుంచి వెళ్లిన కిష్టారెడ్డి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అన్ని చోట్ల వెతుకుతున్న క్రమంలో వ్యవసాయ పొలం వద్ద ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నారాయణఖేడ్‌లో వివాహిత..

పటాన్‌చెరు టౌన్: వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్‌కు చెందిన సాయిలు బతుకుదెరువు కోసం 20 సంవత్సరాల క్రితం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు వచ్చి కూలీ పనులుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా పెద్ద కూతురు మౌనిక(23)కు సంవత్సరం క్రితం కంగ్టి మండలం రామతీర్థంకు చెందిన జైపాల్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు తరచూ జరుగుతుండడంతో మౌనిక రెండు నెలల క్రితం చిట్కుల్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు కూలీ పనికి, చెల్లెలు స్కూల్‌కి వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో మౌనిక సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

లారీ దిగబడడంతో తప్పిన ప్రమాదం

చేర్యాల(సిద్దిపేట): దుద్దెడ-జనగామ జాతీయ రహదారిపై తాడూరు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం ఉదయం లోడుతో జనగామ వైపు వెళుతున్న లారీ దిగబడింది. దీంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాత్కాలిక మరమ్మత్తు పనులు చేశారు. అక్కడ మట్టి పోశారు. ఈ మట్టి గట్టిపడకుండానే ఆ రోడ్డు గుండా లారీ లోడుతో వెళ్తున్న క్రమంలో భూమిలోకి దిగబడింది. డైవర్షన్ ఇరుకుగా ఉండడంతో పక్క నుంచి వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆ దారి గుండా ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్రవాహనాలు, కార్లు మాత్రమే ఆ వైపుగా వెళ్లాయి. జనగామ సిద్దిపేట మధ్యలో నడిచే ఆర్టీసీ బస్సులు కొన్ని రద్దు కాగా మరి కొన్ని కొమురవెల్లి, చేర్యాల మీదుగా వెళ్లాయి. ఆ వైపుగా వచ్చిన లారీలు మాత్రమే అక్కడే నిలిచిపోయాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై పోసిన మట్టిని గట్టిపడే విధంగా చదును చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డులో దిగబడిన లారీ

ట్రాక్టర్, ఎక్సెల్ ఢీ.. ఇద్దరికి గాయాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ట్రాక్టర్, ఎక్సెల్ ఢీకొన్న సంఘటనలో తండ్రి, కూతురికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం కొల్చారం మండలం రంగంపేట నుంచి జోగిపేట వైపు శేరిపల్లి గంగరాం తన కూతరితో ఎక్సెల్‌పై వస్తున్నాడు. చిట్కుల్ పెట్రోల్ పంపు నుంచి గ్రామానికి చెందిన సుధాకర్ ట్రాక్టర్‌పై వస్తున్నాడు. దీంతో ఇరువురు చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గంగరాం, అతడి కూతురికి కాళ్లు విరిగాయి. వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముత్తంగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

సంగారెడ్డి మున్సిపాలిటీ: రోగి పరిస్థితి బాగా లేదని సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేశారు. వారం క్రితం డెలివరీ కోసం ఝరాసంఘం మండలం కంభాలపల్లి నుంచి శరినా డెలివరీ కోసం వచ్చింది. దీంతో ఇక్కడ డెలివరీ చేసే క్రమంలో శిశువు మృతి చెందింది. దీంతో తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో సిటీలోని ఓ ప్రైవేటు ఆ సుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డిలోని ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. పోలీసుల జోక్యంతో ఆందోళన కారులను సముదాయించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటి నుంచి ఆడుకుంటూ బయటకు వెళ్లిన ఓ చిన్నారి తప్పిపోయిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారంలో బుధవారం జరిగింది. బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన ఐదేళ్ల శ్రీహర్షిణి ఇంటి ముందు ఆడుకుంటూ బయటకు వెళ్లింది. చిన్నారి కోసం తల్లిదండ్రులు రెండుగంటల పాటు వెతికారు. కాగా బీరప్పబస్తీలో ఓ చిన్నారిని చూసి స్థానికులు అంగన్‌వాడీ టీచర్లకు సమాచారం అందజేశారు. చిన్నారి తప్పిపోయిన విషయాన్ని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీడీపీఓ చంద్రకళ విచారణ అనంతరం చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను చూపుతున్న ఎస్పీ చక్రవర్తి, సీఐ లాలూ నాయక్



నర్సాపూర్: పోలీసుల అదుపులో నిందితుడు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా గంజాయి పండిస్తూ విక్రయించేందుకు రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో-పోలీసులు సంయుక్తంగా ప్రణాళికతో పట్టుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ చక్రవర్తి, పటాన్‌చెరు సీఐ లాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన రాజారావు, అతని బంధువు బాబ్జీతో కలిసి తమ సొంత భూమిలో గంజాయి పండించి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసేవారు. ఒక కారు అంతర్భాగంలో సెల్ఫ్‌లు ఏర్పాటు చేసుకుని తనిఖీల్లో దొరకకుండా అందులో గంజాయి దాచి రవాణా చేసేందుకు అనువుగా కారును ఏర్పాటుచేసుకున్నారు. వీరికి పరిచయమైన ఈస్ట్‌గోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన శివ సాయికుమార్ సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం శంకరాయ తండాకు చెందిన రాథోడ్ వెంకట్‌కు విక్రయించేవారు. ఇలా ఈ నెలలో మూడుసార్లు అతనికి విక్రయించేందుకు రవాణా కూడా చేశారు. ఈ క్రమంలో తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో-పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ వద్ద అంతరాష్ట్ర ముఠాను మంగళవారం రాత్రి పట్టుకొని వారి వద్దనుంచి 90 కిలోల గంజాయి, కారు, పట్టుబడిన రాజారావు, బాబ్జీ, శివ కుమార్, రాథోడ్ వెంకట్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు ప్రాసాద్‌ఐలు రామనాయుడు, ప్రసాద్ రావు సిబ్బంది తదితరులు తరలించారు.

నర్సాపూర్‌లో ఎండు గంజాయి..

నర్సాపూర్: నర్సాపూర్‌లో బుధవారం ఎండు గంజాయిని పట్టుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..నర్సాపూర్ పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీలో నివాసం ఉండే మహ్మద్ సమీరొద్దీన్ ఎండు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు అతని ఇంట్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో రెండు కిలోల 35 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితుడు హైదరాబాద్‌లోని జియాగూడ నుంచి రూ.14వేలకు కిలో గంజాయి తెచ్చేవాడని విచారణలో ఒప్పుకున్నాడు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్, సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, నవీన్, యశోద, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



జహీరాబాద్: నిలిచివున్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటన పట్టణంలోని మహీంద్ర కర్మాగారం వద్ద 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి..జహీరాబాద్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా రావులపాలెం నుంచి ముంబాయి వెళుతున్న లారీ ఎదురుగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ జి.వెంకట సురేంద్ర, క్లీనర్ కనకరాజులు తీవ్రంగా గాయపడ్డారు. వారు అందులోనే ఇరుక్కుపోవడంతో ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది గ్యాస్ కట్టర్ సహాయంతో వారిని అందులో నుంచి బయటకు తీశారు. అనంతరం వారిని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వారిని హైదరాబాద్‌క తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



లారీని ఢీకొన్న మరో లారీ

గాయపడిన డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

దళిత బంధులో అవకతవకలపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న దళితులు

పోలీసుల జోక్యంతో నిరసన విరమణ

వర్గల్(గజ్వేల్): దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం వర్గల్ మండలం నాచారంలో దళితులు రోడ్డెక్కారు. తూప్రాన్-గజ్వేల్ రహదారిపై నాచారం బస్టాండ్ వద్ద రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభింపజేశారు. దళితబంధు పథకం కోసం అర్హులైన వారినే ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గౌరారం పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించి, అర్హులకే పథకం వర్తింపజేస్తామని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై ధర్నాచేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

మెదక్ మున్సిపాలిటీ: రేపటి నుంచి నియోజకవర్గంలోని ఆసక్తి గల యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2, 4 వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 14 నుంచి 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు 7382565678, 9393850898 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విస్తారంగా మొక్కలు నాటాలి


గుంతలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): వర్షాలు కురుస్తుండటంతో మున్సిపాలిటీ పరిధిలో విస్తారంగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ సూచించారు. ఆయన బుధవారం మొక్కలు నాటడానికి వీలుగా తీసిన గుంతలను పరిశీలించారు. నాటిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని తెలిపారు. టార్గెట్ మేరకు ఈసారి మొక్కలు నాటుతామని చైర్మన్ పేర్కొన్నారు.

జీవనమంత్ర ఫౌండర్‌కు డాక్టరేట్

చేగుంట(తూప్రాన్): జీవన మంత్ర యోగా ఫౌండేషన్ స్థాపకుడు యోగా శిక్షకుడు పీఈటీ నరేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య విభాగంలో ఎఫెక్ట్ ఆఫ్ సెలక్టెడ్ యోగిక్ ఎక్సర్‌సైజ్ ఆన్ ఎమోషనల్ హెల్త్ ఆఫ్ మెయిన్ వాలీబాల్ ప్లేయర్ ఇన్ తెలంగాణ అనే అంశంపై నరేష్ పరిశోధన చేయగా డాక్టరేట్‌ను అందుకున్నారు. నరేష్‌కు పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. చేగుంటలో నివాసం ఉంటున్న నరేష్‌కు డాక్టరేట్ రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవనమంత్ర ఫౌండేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రేగోడ్ హెడ్ కానిస్టేబుల్ రవికి సేవా పతకం

రేగోడ్(మెదక్): మండలం కేంద్రం రేగోడ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికి ఉన్నతాధికారులు సేవా పతకం ప్రకటించారని చెప్పారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శినికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘువీరారెడ్డి బుధవారం విరాళం అందజేశాడు. బిజ్లీపూర్‌లో నిర్మించిన గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి రూ.25 వేలు, అల్లీపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయానికి రూ.25 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతని సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు అశోక్, వెంకట్‌రెడ్డి, రహీమ్, యాదగిరి ఉన్నారు.

'రాహుల్‌పై కేంద్రం కక్ష సాధింపు'

వెల్దుర్తి (తూప్రాన్): రాహుల్ గాంధీపై అనర్హత వేటు విషయంలో ఏఐసీసీ పిలుపుమేరకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు సంఘీభావంగా మండల కేంద్రం వెల్దుర్తి అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ నాయకులు మౌన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద నోటికి నల్లగుడ్డలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ కిషన్, మాజీ సేవాదళ్ ఉపాధ్యక్షుడు రాములు, కుకునూరు కో ఆపరేటివ్ డైరెక్టర్ లక్ష్మయ్య, యాదగిరి సీనియర్, యాదయ్య, శ్రీనివాస్, ప్రేమ్‌దాస్, నవీన్, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జీఎంఆర్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట శివారులోని జాతీయ రహదారిపై జీఎంఆర్ ప్రతినిధులు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎస్‌వీ ఇంటర్‌నేషనల్ టీం లీడర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని జాతీయ రహదారిపై 64వేల మొక్కలు నాటినట్లు, 243 లక్షల మొక్కలకు జియో టాగింగ్ చేసి హరిత్ పాత్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఇంజనీర్ హజ్రత్‌రెడ్డి, శ్రీనివాస్, పోచంపల్లిహైవే సిబ్బంది లక్ష్మణ్‌రావు, సతీష్ కుమార్, పట్నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షానికి పత్తిపంటతో పాటు ఆరుతడి పంటలకు, వరిపంటలకు మేలు చేకూర్చింది.

ప్లాస్టిక్ వ్యర్థాల గుట్ట

మెదక్ మున్సిపాలిటీ: ఎదురుగా ఫొటోలో కనిపించేది డంప్‌యార్డ్ కాదు. ప్లాస్టిక్ వ్యర్థాల గుట్ట. ఇదే ఎక్కడో కాదు మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఆటోనగర్ ప్రాంతంలోని ఓ వైన్స్ వెనకాల. ప్రతీరోజు ప్రతీ వీధి నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తున్నామని ప్రచారం చేసుకునే మున్సిపల్ శానిటేషన్ అధికారులకు ఈ ప్లాస్టిక్ వ్యర్థాల గుట్ట కనిపించడం లేదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించడం లేదని చెప్పడానికి ఈ వ్యర్థాల గుట్ట నిదర్శనమని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటి కైన సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వెల్దుర్తి, మాసాయిపేట్ మండల కేంద్రాల్లో సుమారు 60 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. చర్లపల్లి, మహ్మద్ నగర్, రామాయిపల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. హస్థాల్‌పూర్ గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, జెడ్పీటీసీ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

రమేశ్‌గౌడ్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలకేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు

ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా

మెదక్‌జోన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ అయితే సరిపోతుందంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని హవేళీఘనపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం హవేళీఘనాపూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఖాలేద్, సర్పంచ్‌లు సవిత, సంధ్య, సాయిలు, రాజేందర్, ఎంపీటీసీ మంగ్యా, పీఏసీఎస్ డైరెక్టర్ సాయిలు, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నర్సాపూర్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం బస్టాండ్ వద్ద దహనం చేశారు. రైతులకు 24గంటల ఉచిత కరెంట్ అవసరం లేదని రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు శేఖర్, అశోక్‌గౌడ్, భిక్షపతి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


మెదక్ మున్సిపాలిటీ: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: కాంగ్రెస్‌కు అవకాశమిస్తే రైతులను పాతరేస్తారని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్ అన్నారు. పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. రైతును రాజు చేయాలని సీఎం కేసీఆర్ అనేక విధాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కృష్ణగౌడ్, కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, జయరాజ్, రాగి అశోక్, మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో తూప్రాన్ - నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేసిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బుచ్చయ్య, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, మాజీ చైర్మన్ రాధకిషన్, సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ నర్సింలు, గ్రామాధ్యక్షుడు సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన వారిలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, పార్టీ పట్టణాధ్యక్షుడు నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


తూప్రాన్‌లో..


రామాయంపేటలో..

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం


నర్సాపూర్ సబ్ స్టేషన్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


రామాయంపేటలో..

నర్సాపూర్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బుధవారం దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్యాంరెడ్డి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి భాను, కౌన్సిలర్ అనిల్‌కుమార్, పార్టీ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తార్యానాయక్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హరి, నాయకులు పాల్గొన్నారు.

నార్సింగి మండలంలో.. చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నార్సింగి మండలం సంకాపూర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): రైతులకు అండగా కాంగ్రెస్ ఉంటుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. శివ్వంపేటలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి బీఆర్‌ఎస్ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంత రావు, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, సత్యనారాయణ, నారాయణగౌడ్, అశోక్, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిలో మండలాధ్యక్షుడు లింగంగౌడ్, నసీరొద్దీన్, మహేందర్, మారుతి, రాజయ్య, వెంకట్, రమేశ్, చంద్రం తదితరులున్నారు.


పాపన్నపేట(మెదక్): సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): శీలాంపల్లిలో..

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కాంగ్రెస్ నాయకురాలు త్రిష దామోదర్

టేక్మాల్ (మెదక్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ ఆందోల్ నియోజకవర్గ నాయకురాలు త్రిష దామోదర్ తెలిపారు. బుధవారం మండలంలోని తంపులూరు గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, జెడ్పీటీసీ సర్వాణి సరోజ, ఎంపీటీసీ భూమయ్య, మండల కాంగ్రెస్ నాయకులు మాన్ కిషన్, నారాయణ, మల్లారెడ్డి, సుధాకర్, సత్యనారాయణ కో ఆప్షన్ మెంబర్ షేక్ మజార్, భక్తుల కిషోర్, సాగర్, సంగమేశ్వర్ గౌడ్ మహేశ్‌రెడ్డి, సక్రు, తంప్లూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుకారాం గౌడ్, ఉప సర్పంచ్ ఖలీల్, నాగయ్య, సాంబయ్య, చిన్న మల్లేశం, కొట్టి ప్రవీణ్, పులి రవి, శివ మల్లయ్య, అనిల్, వెంకట్ గౌడ్, సర్వని సంఘయ్య, జాదవ్ సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని, అందరికీ విద్య, వైద్యం అందిచడమే లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ఆత్మగౌరవ యాత్ర మూడో రోజు మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్, జీడిపల్లి గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముప్పిరెడ్డిపల్లి దళిత వాడలో నిద్రించిన ఆయన ఇంటింటికి తిరిగాడు. వీరి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సిద్దిపేట్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, నాయకులు శ్రీశైలంగౌడ్, గోపాల్, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, నర్సింహ, కృష్ణ, సాదు సత్యనారాయణ, సంతోశ్‌కుమార్, నాగరాజుగౌడ్, సాయి, రంగాచారి, వెంకటేశ్, నాగరాజు, ఐలేశ్, నవీన్, మైనార్టీ యువకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.


తంపులూర్‌లో పర్యటిస్తున్న త్రిష దామోదర్

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నిజాంపేట(మెదక్): అర్హులందరూ రైతుబీమాకు దరాఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సతీశ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జూన్ 18 వరకు పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులు 18–59 వయస్సు గల రైతులు బీమాకు అర్హులు అవుతారని తెలిపారు. ఇందు కోసం రైతులు ఆధార్‌కార్డు, పట్టా పుస్తకం జిరాక్స్, నామిని ఆధార్ కార్డు, రైతు బీమా ఫామ్‌ను తీసుకోని వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారిణి కావేరి తదితరులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): రైతుబీమాకు అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ జావిద్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు తీసుకున్న రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): రైతుబీమాకు 2023–24కి గాను జూన్ 16 వరకు నూతన పట్టాపాస్‌బుక్స్ పొందిన రైతులు రైతుబీమాకు ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏఓ రాజేష్‌కుమార్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో బాధిత కుటుంబీకులకు సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ నాయకులకే ప్రభుత్వ పథకాలు’

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పథకాలు కేవలం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సూచించే వారికి మాత్రమే దక్కుతున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలకు రూ. 3 లక్షల రూపాయల స్కీంలో కూడా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకే అందజేస్తున్నట్టు విమర్శించారు. కులవృత్తులకు అందజేస్తామని ప్రకటించిన రూ. 1 లక్ష స్కీంలో కూడా ప్రతి వార్డుకు 2 మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, శంకర్, గూడూరి ఆంజనేయులు శ్రీనివాస్, పద్మారావు, విజయ్, మహేందర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, రమేశ్‌గౌడ్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండ్ల బోనాల ఊరేగింపు


ముత్యాలమ్మ ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలో రెండు రోజుల పాటు జరిగే బండ్ల బోనాల పండగలో భాగంగా బుధవారం ముత్యాలమ్మకు భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్ల బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలతో సందడిగా మారింది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


శివ్వంపేటలో సమ్మెలో కార్మికులు


మనోహరాబాద్(తూప్రాన్): కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె బుధవారం ఏడో రోజుకు చేరింది. తమ న్యాయమైన పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వీరికి వీఆర్‌ఏలు సంఘీభావం తెలిపారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో నిర్వహించిన సమ్మెలో కార్మిక సంఘం అధ్యక్షుడు ఎల్లం, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

టేక్మాల్ (మెదక్): మండల కేంద్రంలో చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ అన్నారు. బుధవారం సమ్మె చేపట్టిన పంచాయితీ కార్మికులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు పి.రాములు, దాసు, సీహెచ్.రాములు న్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మెలో భాగంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో పంచాయతీ కార్మికులు, నాయకులున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో సమ్మె కొనసాగించారు. కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ తల్లి రాజమ్మ మృతి చెందింది. దీంతో బుధవారం మండలంలోని రుద్రారం గ్రామంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి లక్ష్మణ్‌ను పరామర్శించి, రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

◆ **పోలీసు సిబ్బందికి విశిష్ట పురస్కారాలు**

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందించిన 7 మంది సిబ్బందికి విశిష్ట పురస్కారాలు వచ్చాయని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పోలీసు ఉత్తమ సేవా పతకం ఎండీగౌస్ (ఎస్‌ఐ, చిలిపిచెడ్), రాష్ట్ర పోలీసు సేవా పతకం ఎండి సైదొద్దీన్ (ఏఆర్‌హెచ్‌సి–23, దార్, మెదక్), ఎం.రవి, హెడ్ కానిస్టేబు(రేగోడ్), టి. ఇమాన్యుల్, హెడ్ కానిస్టేబుల్(పీసీఆర్, మెదక్), పి.కనకయ్య హెడ్ కానిస్టేబుల్(రామాయంపేట), ఈ.సుధాకర్(ఏఆర్‌హెచ్‌సీ –514,దార్, మెదక్), సయ్యద్ సికిందర్, హెడ్ కానిస్టేబుల్ (అల్లాదుర్గం)లు ఈ పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు.

◆ **ఉపాధ్యాయులు పదోన్నతులు ప్రారంభించాలి**

మెదక్‌జోన్: ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టులో కేసు పరిష్కారం ఆలసమయ్యే ఆలోచనలు ఉన్నందున వెంటనే పదోన్నతులు, నియామక ప్రక్రియను ప్రారంభించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

◆ **దరఖాస్తు పత్రాల అందజేత**

చేగుంట(తూప్రాన్): ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి ద్వారా అందించే ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులు దుబ్బాక ఎంపీ కార్యాలయంలో అందించినట్లు బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు నదీం తెలిపారు.

◆ **ఆర్థిక సాయం**

శివ్వంపేట(నర్సాపూర్): నిరుపేద కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పాంబండ గ్రామానికి చెందిన దుబ్బ మహేశ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు డీలర్ రాజశేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శేఖర్, సంతోష్‌కుమార్ ఉన్నారు.

◆ **ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం**

చేగుంట(తూప్రాన్): కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు తెలిపారు. బుధవారం కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తింపబడిన లెక్చరర్‌లు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు, లెక్చరర్‌లు ఉన్నారు.

◆ **వర్షంలోనే శివ్వంపేట సంత**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. దీంతో శివ్వంపేటలో కురిసిన వర్షంలోనే సంత కొనసాగింది.

◆ **నేడు మహా ధర్నా**

మెదక్ మున్సిపాలిటీ: నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామని.. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన మహా ధర్నా ఉంటుందని తెలిపారు.

◆ **కాంగ్రెస్ నాయకుల మౌన దీక్ష**

మెదక్ జోన్: రాహుల్ గాంధీపై అనర్హత వేటు పై నిరసనగా కాంగ్రెస్ నాయకుడు హఫీజొద్దీన్ బుధవారం డీసీసీ పార్టీ కార్యాలయంలో పలువురి కార్యకర్తలతో ఆయన మౌన దీక్ష చేశారు.

◆ **ప్రశాంతంగా విద్యా సంస్థలు బంద్**

నర్సాపూర్/రామాయంపేట(మెదక్)/చిన్నశంకరంపేట(మెదక్)/తూప్రాన్: జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు మేరకు బుధవారం ఆ యా విద్యా సంస్థలను మూసి వేశారు. పలు కాలేజీలకు చెందిన విద్యార్థులతో చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, రాజేశ్, నరేందర్, మోహన్, సాయికుమార్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న నీటి నిల్వలు


కాళ్లకల్‌లో వివేకానంద స్కూల్ వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): చిరు వర్షాలకే కాలనీలు చిత్తడిగా మారుతున్నాయి, కొన్ని కాలనీలు మురుగు కాల్వలు లేక చెరువులను తలపిస్తున్నాయి. మనోహరాబాద్ మండలంలోని మేజర్ పంచాయతైన కాళ్ళకల్‌లో చిరు వర్షాలకే చెరువులుగా మారుతున్నాయి. దీంతో తమకు వర్షాకాలం వస్తే సమస్యలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టి మురుగు కాల్వలను, నీటి నిల్వలు లేకుండా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.